ఉపాధి కూలీల ఆకలి కేకలు

- కూటమి ప్రభుత్వంలో అందని వేతనాలు
- రూ.40 లక్షల మేర ఉన్న బకాయిలు
- నగదు కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వంలో ఉపాధి కూలీల ఆకలి కేకలు పెరిగిపోతున్నాయి. చేసిన పనికి చెల్లించాల్సిన వేతనాలను నెలల తరబడి ఆపేస్తుండడంతో వారికి పూట గడవడమే కష్టంగా మారింది. దాదాపు నెలన్నరగా కూలి డబ్బులు అందక చాలా మంది ఉపాధి హామీ పనులను వెళ్లడం కూడా ఆపేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పాలకుల్లో చలనం ఉండడం లేదు.


మండపం పంచాయతీలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

తోటపల్లిగూడూరు: వలసల నివారణే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలను ఆదుకోలేకపోతోంది. కూలీలకు వంద రోజుల పని కల్పించలేక ఓ వైపు, పని చేసిన కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించలేక మరోవైపు ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధి పథకంపై కూలీలు అసహనం వ్యక్తం చేస్తూ పనులను బహిష్కరించాల్సి వస్తోంది. మండలంలో 22 పంచాయతీలకు సంబంధించి 8 వేల మందికి జాబ్‌కార్డులుండగా అందులో కేవలం 4 వేల మంది మాత్రమే ప్రస్తుతం పనులను వినియోగించుకొంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు, మాచర్లవారిపాళెం, వరకవిపూడి, వరిగొండ, కోవెరపాళెం, సౌత్‌ఆములూరు, ఈదూరు-1, ఈదూరు-2, తోటపల్లి గ్రామాల్లో మాత్రమే ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి.

నెలన్నరగా..

ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతున్న ఆయా గ్రామాల్లోని కూలీలకు నెలన్నరగా వేతనాలు అందాల్సి ఉంది. గతేడాది డిసెంబర్ రెండో వారం నుంచి ఈ ఏడాది జనవరి మొత్తం పనిచేసిన కూలీలకు వేతనాలు రావాలి. 15 వేల పనిదినాలకు గానూ దాదాపు రూ.40 లక్షల వరకు అందాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఏ పూటకు ఆ పూట పనులు చేసుకుని జీవించే పేదలు ఇన్నేసి వారాల తరబడి వేతనాలు అందకపోతుండటంతో ఇబ్బందులతో గడపాల్సి వస్తోంది. గతంలో వారం మార్చి వారం వ్యవధిలోనే కూలీల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ విధానానికి స్వస్థి పలికి 15 రోజులకోసారి నగదును అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఏకంగా నెల, రెండు నెలల వరకు వేతనాలకు బ్రేక్ పడుతున్నాయి. ఈ పరిస్థితిలో ఉపాధి హామీ పనులపై పేదలు ఆసక్తి చూపలేకపోతున్నారు. దీంతో అన్ని గ్రామాల్లో అధికారులు పనులను పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నారు.

ఉపాధి పథకంపై నమ్మకం పోతోంది



గతంలో పనిచేసిన కూలీలకు వారం మార్చి వారం నగదు అందేది. కానీ ప్రస్తుతం నెల నుంచి రెండు నెలల సమయం పడుతోంది. ప్రస్తుతం నాకు ఆరువారాలకు గానూ రూ.1,600 నగదు రావాలి. ఏ పూటకాపూట కూలి చేసుకుని జీవించే మాలాంటి వారికి ఇంతకాలం నగదు అందకపోతే ఎలా. ఈ పరిస్థితిల్లో ఉపాధి పథకంపై నమ్మకం కోల్పోవాల్సి వస్తోంది.

– బత్తల సుబ్రహ్మణ్యం, ఉపాధి కూలీ, మండపం పంచాయతీ

ఉన్నతాధికారులకు పంపాం



ప్రస్తుతం మండలంలో పది గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతున్నాయి. వేతనాలకు సంబంధించి గతేడాది డిసెంబర్ రెండో వారం వరకు కూలీలకు పంపిణీ చేశాం. ఆ తర్వాత జరిగిన పనులకు సంబంధించి వివరాలను రికార్డు చేసి ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే కూలీల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తాం.

– రమేష్, ఈసీ, ఉపాధి హామీ పథకం, తోటపల్లిగూడూరు

విద్యార్థుల వినూత్న నిరసన


ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న చిన్నారులు

- అధికారులకు తల్లిదండ్రుల వినతి

మనుబోలు: 'మా బడి మాకు కావాలి. మేము ఇక్కడే చదువుకుంటాం' అంటూ చిన్నారులు ఎండలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం 3, 4, 5 తరగతులను మోడల్ స్కూళ్లలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మనుబోలు కోదండరామాపురం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇక్కడి విద్యార్థులను సీఎం నగర్ పాఠశాలకు తరలించేందుకు సిద్ధమవుతోంది. తాము అంతదూరం వెళ్లలేమని తమ స్కూల్‌ను ప్రస్తుతం ఉన్నచోటే కొనసాగాలని కోరారు.

• బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులు కూడా శుక్రవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. తమ పిల్లలు సీఎం నగర్ పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హైవేపై కూడా వెళ్లాల్సి ఉన్నందున ప్రమాదాలు పొంచి ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు బీసీ కాలనీ స్కూల్‌ను కొనసాగించాలని కోరారు.


ఎంఈఓ కార్యాలయం వద్ద తల్లిదండ్రులు

ఇందుకూరుపేట: తరగతుల తరలింపు సరికాదని మండలంలోని గమళ్లపాళెం వాసులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గమళ్లపాళెంలోని పాఠశాలలో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ ఉన్న మూడో తరగతి నుంచి ఐదో తరగతి పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలోని ఇందుకూరుపేటకు తరలిస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

వైభవంగా వసంతోత్సవం



పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్ల వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం వివిధ పూజలు జరిగాయి. రాత్రి అశ్వవాహన సేవ, పార్వేట కార్యక్రమాలు జరిగాయి. 10 గంటలకు ధ్వజావరోహణం, నవ సంధి దేవతా ఉద్వాసన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

తోటపల్లిగూడూరు: బ్రహ్మదేవి 132 కేవీ సబ్‌స్టేషన్‌లో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా తోటపల్లిగూడూరు సబ్‌స్టేషన్ ఏఈ సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోటపల్లిగూడూరు, సాలిపేట, మండపం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. సాధారణ విద్యుత్ సరీసులతోపాటు ఆక్వా సర్వీసులకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

• **ముత్తుకూరు:** మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈఈ రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మదేవిలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం

మనుబోలు: మనుబోలు పంచాయతీ పరిధిలో రూ.1.3 కోట్లతో వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనానాయక్ స్థానిక టీడీపీ నాయకులతో కలిసి శ్మశానవాటిక ఆవరణలో భూమిపూజ చేశారు.

బస్సులను పునరుద్ధరించాలని వినతి

ఇందుకూరుపేట: కుడితిపాళెం మీదుగా మైపాడు – నెల్లూరు వెళ్లే బస్సులను పునరుద్ధరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ మేరకు నెల్లూరులో ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నిడిముసలి, మైపాడు, నెల్లూరు వైపు రెండు.. మైపాడు, నిడిముసలి వైపు రెండు బస్సులు తిరిగేవని, అయితే కొంతకాలంగా వీటిని తొలగించడంతో మండల వాసులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా సాయి

కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా యల్లాయపాళేనికి చెందిన జడ్డా సాయికుమార్ నియమితులయ్యారు. మండలంలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.

నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

కోవూరు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని నందలగుంటలో ఏర్పాటు చేసిన గృహ సముదాయాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మధ్యలో నిలిచిపోయిన గృహాలను ప్రారంభించాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా చెంగారెడ్డి



ముత్తుకూరు: వైఎస్సార్ సీపీ సర్వేపల్లి నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా పంటపాళేనికి చెందిన నంగా చెంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి. చెంగారెడ్డి నియామకం పట్ల పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

విడవలూరు: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్సై నరేష్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని ఎన్నెస్సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ సుజాత, ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ మధు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ముత్తుకూరు: 'గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందులో భాగంగా కమిటీల ద్వారా అవగాహన కల్పిస్తాం' అని అదానీ ఫౌండేషన్ ప్రకటించింది. ముత్తుకూరు, కృష్ణపట్నం, తమ్మినపట్నం గ్రామాల్లో శుక్రవారం శానిటేషన్ అవేర్‌నెస్ అండ్ ప్రాక్టీస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రొఫెషనల్ శానిటేషన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ సాయినాథ్ మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు సామాజిక బాధ్యత ద్వారా శానిటేషన్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్‌బాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

పొదలకూరు: ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు మాత్రలను వేయాలని మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవంతి పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ప్రతి బిడ్డకు ఆల్బెండాజోల్ మాత్రలను మింగించాల్సిందిగా సూచించారు. ప్రజలు సైతం అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో సిబ్బంది, హెల్త్ ఆఫీసర్ ఆదిలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, నరసమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి

గ్రామ పంచాయతీ కార్యాలయంలో పరిశీలన

కోవూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గల తడి, పొడి చెత్త కేంద్రాల ద్వారా వర్మికంపోస్ట్ ఎరువులను ఈనెల రెండో వారంలో విక్రయించేలా చూడాలని డీపీఓ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

తాటికల్లుకు డిమాండ్


తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు


కల్లు కుండలు

పొదలకూరు: ప్రతి ఏటా జనవరి నుంచే ఈ ప్రాంతంలో కల్లు సీజన్ ప్రారంభమవుతుంది. అయితే చలి వల్ల కొందరు గీత కార్మికులు కల్లు గీసేందుకు వెళ్లరు. ఫిబ్రవరి నుంచి ఎండల తీవ్రతను బట్టి ఈ పనికి శ్రీకారం చుడుతుంటారు. ప్రాణాలను పణంగా పెట్టి తాటిచెట్లు ఎక్కి కల్లు గీసి అమ్మకాలు సాగిస్తుంటారు. గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచే కల్లు కోసం తాటిచెట్ల వద్ద పోటీలు పడుతుంటారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో తాటికల్లు గీస్తుంటారు.

అగ్నిమాపక కేంద్ర ఏర్పాటుకు స్థల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశమై పలు ప్రాంతాల్లో స్థలాలను అసిస్టెంట్ ఫైర్ అధికారి వేణుగోపాల్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం పరిశీలించిన స్థలాలను నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శాంతినగర్‌లో ఏర్పాటు చేసేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తెలియజేసి, తాత్కాలిక స్థలాన్ని కేటాయించి వాహనాన్ని త్వరలోనే తీసుకొస్తామని వివరించారు.



ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సురేఖ

పొదలకూరు: ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ సురేఖకు బాధ్యతలు అప్పగించారు. తహసీల్దార్ శివకృష్ణయ్య 15 రోజులపాటు సెలవుపై వెళ్లారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ (రీ సర్వే) సురేఖ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు.

ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

పొదలకూరు: మండలంలోని విరువూరు ఇసుక రీచ్ నిర్వహణపై పర్యావరణ పరిరక్షణ (ఎన్విరాన్‌మెంట్) శాఖ గురువారం సాయంత్రం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. మీడియాకు సమాచారం ఇవ్వకుండా అధికారులు సమావేశాన్ని నెల్లూరు ఆర్డీఓ అనూష పర్యవేక్షణలో ఇది జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యంత్రాలను ఏర్పాటు చేసి ఇసుకను ఇష్టానుసారంగా లోడుతున్నారని కూలీల ద్వారా ఇసుకను తరలించాల్సిందిగా కోరారు. యంత్రాలను వినియోగిస్తే చుట్టుపక్కల భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖ, ఆర్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నట్లు తెలిసింది.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా

మనుబోలు: వ్యవసాయానికి 9 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏ గ్రూపులో ఉన్న కాగితాలపూరు, మనుబోలు, బద్దెవోలు ఫీడర్ల పరిధిలో ఉదయం 7.15 నుంచి మధ్యాహ్నం 4.15 వరకు త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. అలాగే బీ గ్రూపులో ఉన్న పిడూరుకు ఉదయం 8.45 నుంచి సాయంత్రం 5.45 వరకు సరఫరా చేస్తామని తెలియజేశారు.

పరీక్షలకు 293 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలో శుక్రవారం నిర్వహించిన పీజీ కోర్సు మొదటి సెమిస్టర్, ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 293 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించి న పరీక్షలకు 2,016 మందికి గానూ 1,842 మంది హాజరై 174 మంది గైర్హాజరయ్యారని తెలియజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 1,673 మందికి గానూ 1,554 మంది హాజరై 119 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

• వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మూడు, ఆరో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు 11 మంది గైర్హాజరయ్యారని మధుమతి తెలిపారు. 205 మందికి గానూ 194 మంది హాజరయ్యారని, 11 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి పంచాయతీలో గురవయ్యసాలలో శుక్రవారం మహాలక్ష్మమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ నాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

తోటపల్లిగూడూరు: విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయమ్మ సూచించారు. కళాశాలలో శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంకింగ్ సేవల గురించి తెలుసుకోవాలన్నారు. నగదు లావాదేవీలు జరిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవైసీ, పిన్ నంబర్లు, ఓటీపీ తదితర వివరాలను ఇతరులకు చెప్పొద్దన్నారు. అలాగే బ్యాంకులు అందించే బీమా స్కీంల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ కుమార్, ఆర్పీ సతీష్, ప్రోగ్రాం ట్రైనర్ ప్రియంవద, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమానికి హాజరైన అతిథులు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని పలు స్వీట్స్, చిప్స్ దుకాణాలను ఫుడ్ సేఫ్టీ అధికారి నీరజ శుక్రవారం తనిఖీ చేశారు. పలు బిస్కెట్ ప్యాకెట్లను సీజ్ చేసి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. తనిఖీల సమాచారాన్ని తెలుసుకున్న పలు తినుబండారాల దుకాణాలను నిర్వాహకులు మూసేశారు. కొంత మంది బోర్డులు కనిపించకుండా పట్టలు కప్పారు.



విజయవంతం చేయండి

ఇందుకూరుపేట: ఈ నెల పదిన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని పాఠశాలలకు ఆల్బెండాజోల్ మాత్రలను చేర్చాలని సూచించారు. తొలుత రికార్డులను పరిశీలించారు. వైద్యసేవలపై డాక్టర్లు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడితో చర్చించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న దయాకర్

షాదీ మంజిల్ మరమ్మతులకు నిధులు

కొడవలూరు: కొడవలూరులోని షాదీ మంజిల్ మరమ్మతులకు రూ.పది లక్షల సీఎస్సార్ నిధులను మంజూరు చేయనున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. కొడవలూరు దర్గా సంఘంలో రూ.ఐదు లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ప్రారంభానికి నోచుకోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. వసతులు కల్పించి వినియోగంలోకి తెచ్చేందుకు గానూ రూ.ఐదు లక్షలను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ట్రై సైకిల్‌కు బ్యాటరీ తదితరాలు మరమ్మతులకు గురై ఇబ్బంది పడుతున్నానని దివ్యాంగుడు తెలియజేశారు. వీటికి మరమ్మతులను చేయిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తహసీల్దార్ స్ఫూర్తి, ఎంపీడీఓ వెంకటసుబ్బారావు, నేతలు శేఖర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, వెంకటరమణారెడ్డి, వంశీకృష్ణారెడ్డి, జిలానీబాషా, శ్రీనివాసులు, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో మార్కెట్ పునర్నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపనను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నిర్వహించారు. నగర పంచాయతి కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లు ప్రత్యూష, పుట్టా లక్ష్మీకాంతమ్మ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరు: దివ్యాంగుడితో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

బ్యాటరీ ట్రై సైకిళ్ల అందజేత

సీఆర్పీ, ఏపీఎల్ఐఎంసీఓ సహకారంతో దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ ఏర్పాటుపై ఆందోళన

ఇందుకూరుపేట: మండలంలోని పున్నూరులో బీపీసీఎల్ పైప్‌లైన్ ఏర్పాటుపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు కోతకొచ్చే దశలో వీటిని నాశనం చేస్తూ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించారు. పైప్‌లైన్‌తో వెళ్తున్న యంత్రాలను అడ్డుకున్నారు.